RNI-TELTEL/2017/72695

11 అక్టోబర్ 2022

శుభ
# తెలంగాణ

మంగళవారం | మేడ్చల్

సంపుటి : 5, సంచిక :223

ఎడిటర్: ఎన్ సీ శేఖర్

వెల: 4 రూ/.

Website:
www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

# 700 కోట్లతో జంతువుల వ్యాక్సిన్ తయారీ కేంద్రం

- తెలంగాణలో మరో అనిమల్ వాక్సిన్ యూనిట్... రూ.700 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఐఐఎల్
- ఇప్పటికే గచ్చిబౌలిలో ఐఐఎల్‌కు ఓ వాక్సిన్ తయారీ యూనిట్
- కొత్తగా జీనోమ్ వ్యాలీలో మరో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న ఐఐఎల్
- ఈ యూనిట్‌తో 750 మందికి ఉపాధి
- ఐఐఎల్ ప్రతిపాదనను ఆహ్వానించిన మంత్రి కేటీఆర్



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** మరో భారీ పెట్టుబడికి హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ వేదికైంది. 700 కోట్ల రూపాయలతో జంతు వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ ( ప్రకటించింది. పశువులకు వచ్చే ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ తో పాటు ఇతర పశువ్యాధులకు సంబంధించిన టీకాలను ఈ కేంద్రంలో ఉత్పత్తి చేయనున్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఈ కేంద్రంతో 750 మందికి ఉపాధి దొరుకుతుంది. జాతీయ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్ ) అనుబంధ సంస్థ అయిన ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ ప్రపంచంలోని అతిపెద్ద వ్యాక్సిన్ తయారీదారులలో ఒకటి. దీంతోపాటు భారత ప్రభుత్వ నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ కి వ్యాక్సిన్ను అందించే ప్రముఖ సరఫరాదారు. ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ వ్యాక్సిన్ , ఇతర జంతు వ్యాక్సిన్ల తయారీ కోసం వెటర్నరీ వ్యాక్సిన్ ఫెసిలిటీ ఏర్పాటకు జీనోమ్ వ్యాలీలో ఎట్టుబడి పెడుతోంది. అత్యాధునిక సౌకర్యాలతో బయో సేఫ్టీ లెవల్ 3 ప్రమాణాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తోంది. గచ్చిబౌలిలో ప్రస్తుతం ఉన్న తయారీ కేంద్రం సంవత్సరానికి 300 మిలియన్ డోస్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. కొత్తగా ఏర్పాటుచేయబోతున్న ఈ వ్యాక్సిన్ తయారీ కేంద్రంతో ఇప్పటికే సంస్థకు ఉన్న సామర్థ్యానికి అదనంగా సంవత్సరానికి 300 మిలియన్ డోసుల వ్యాక్సిన్ ఉత్పత్తి అవుతుంది. , డాక్టర్ కె.ఆనంద్ కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు ముకుల్ గౌర్, భార్గవ్లతో పాటు సంస్థ కు చెందిన ఇతర అధికారులు ఇవాళ మంత్రి కేటీఆర్ తో సమావేశమయ్యారు. తమ సంస్థ విస్తరణ ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్లో ఏర్పాటుచేయబోతున్న మూడవ టీకా తయారీ కేంద్రం వ్యాక్సిన్ ఉత్పత్తిలో భారతదేశ స్వయం సమృద్ధికి నిదర్శనం అని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ . ఆనంద్ కుమార్ చెప్పారు. తమ వ్యాక్సిన్ తో పశువులకు వచ్చే తీవ్రమైన వ్యాధులు తగ్గడంతో పాటు రైతులకు, దేశానికి వేల కోట్ల రూపాయలను ఆదా అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ సంస్థ జీనోమ్ వ్యాలీలో మరో వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ కొత్త టీకా ఉత్పత్తి కేంద్రంతో ప్రపంచ వ్యాక్సిన్

రాజధాని గా లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ జోరు కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ , తెలంగాణ ప్రభుత్వ డైరెక్టర్ (ఫార్మా లైఫ్ సైన్సెస్) శక్తి ఎం నాగప్పన్ కూడా పాల్గొన్నారు. ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ గురించి %ఇండియన్ ఇమ్యునో లాజికల్స్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్లో ఉంది. ఇది ఒక ఆరోగ్య రంగానికి చెందిన సంస్థ. ఆసియాలోని వ్యాక్సిన్ ఉత్పత్తి సంస్థల్లో ఒకటి. 1982లో నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ చే స్థాపించబడింది. ఈ సంస్థ ఉత్పత్తులు 50 దేశాలకు ఎగుమతి అవుతాయి.

## తెలంగాణ సీఐడీ డీజీ గోవింద్ సింగ్ సతీమణి దుర్మరణం



- మాతేశ్వరి తనోతరాయ్ మాత ఆలయ సందర్శనకు వెళ్లిన గోవింద్ సింగ్ దంపతులు
- తిరుగు ప్రయాణంలో రామ్ గఢ్ వద్ద బోల్తా పడ్డ కారు
- ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయిన షీలా సింగ్
- గాయాలతో బయటపడ్డ గోవింద్ సింగ్, కారు డ్రైవర్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** రాజస్థాన్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తెలంగాణ సీఐడీ డీజీ గోవింద్ సింగ్ సతీమణి షీలా సింగ్ మృతి చెందారు. ఈ ప్రమాదంలో గోవింద్ సింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గోవింద్ సింగ్‌తో పాటు ఆయన కారు డ్రైవర్ కూడా గాయాల పాలయ్యారు. రాజస్థాన్‌లోని మాతేశ్వరి తనో తరాయ్ మాత ఆలయాన్ని సందర్శించుకునే నిమిత్తం భార్య షీలా సింగ్‌తో

వివరాలు 2లో..

## కేసీఆర్ ఇంచార్జ్‌గా ఉన్న ఊళ్లో రేవంత్ రెడ్డి ప్రచారం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** సీఎం కేసీఆర్ దత్తత గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇంచార్జ్‌గా ఉన్న లెంకలపల్లి గ్రామంలో నిర్వహించిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. లెంకలపల్లి బస్టాండ్‌లో కేసీఆర్ తట్టెడు మట్టి కూడా పోయలేదని మండిపడ్డారు. ఒక్కసారి గెలిచినవాళ్లు కోట్లు సంపాదిస్తే.. ఐదుసార్లు గెలిచిన పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఏమి సంపాదించుకోలేదన్నారు. మోడీ, కేసీఆర్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని రేవంత్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ లో జరిగిన అభివృద్ధే తప్ప... టీఆర్ఎస్, బీజేపీ మునుగోడు అభివృద్ధికి చేసిందేమి లేదని విమర్శించారు. ఒక్కసారి పాల్వాయి స్రవంతికి అవకాశం ఇవ్వాలని కోరారు. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చింది కాంగ్రెస్ ఒక్కటేనని చెప్పారు.

## నేను బయటనే మంత్రిని... ఇంట్లో కాదు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** తమ బంధువుల ఇంట్లో జరిగిన ఓ విందులో చుట్టాలకు మందు పోశానని, అందులో తప్పేముందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. మునుగోడు ఓటర్లకు మందు పోసి.. వాళ్లను ప్రలోభపెట్టేందుకు మంత్రి మల్లారెడ్డి ప్రయత్నించారంటూ మీడియాలో పెద్ద ఎత్తున వార్తా కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మంత్రి మల్లారెడ్డి

వివరాలు 2లో..


## ములాయం అంత్యక్రియలకు హాజరుకానున్న సీఎం కేసీఆర్



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** సీఎం కేసీఆర్ రేపు ఉత్తర ప్రదేశ్ కు వెళ్లనున్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ అంత్యక్రియలకు హాజరుకానున్నారు. ములాయం పార్థివ దేహానికి కేసీఆర్ నివాళులు అర్పించనున్నారు. ఈ విషయాన్ని సీఎంవో కార్యాలయం వెల్లడించింది. అనారోగ్య సమస్యలతో ఉదయం కన్ను మూసిన ములాయం సింగ్ అంత్యక్రియలను అక్టోబర్ 11న ఆయన స్వగ్రామం సాయ్‌ఫాయ్‌లో అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ములాయం సింగ్ యాదవ్ మృతి పట్ల సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీకి మూడుసార్లు సీఎంగా, కేంద్రమంత్రిగా జీవితాంతం నిరుపేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ములాయం పని చేశారని కేసీఆర్

వివరాలు 2లో..

## ఆ ముగ్గురు వైద్య రంగానికి మూలస్తంభాలు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** : ఆశాలు, ఏఎన్ఎంలు, ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లు.. వైద్య రంగానికి మూలస్తంభాలు అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంసించారు. రోగులను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్యం అందిస్తే, వ్యాధి ముదరకముందే రోగిని కాపాడుకోవచ్చన్నారు. కేవలం రోగులను కాపాడిన వాళ్లమే కాకుండా, రోగి కుటుంబం వైద్యం కోసం అప్పుల్లో పడకుండా, ఆర్థికంగా కుంగిపోకుండా కాపాడిన వాళ్లం అవుతామని హరీశ్‌రావు చెప్పారు. పీహెచ్‌సీ, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశాల పనితీరుపై నిర్వహించే నెలవారీ సమీక్షలో భాగంగా ఇవాళ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కూడా త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. 9 జిల్లాల్లో రక్త హీనత, పోషకాహార లోపం ఉన్న గర్భిణ

వివరాలు 2లో..

## పోలీస్ శాఖ నుంచి సీఐ నాగేశ్వరరావు తొలగింపు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** సీఐ నాగేశ్వరరావు రావు ను సర్వీస్ నుంచి తొలగి స్తూ పోలీస్ శాఖ ఉత్తర్వు లు జారీ చేసింది. వనస్థలి పురంలో మహిళను తుపాకీతో బెదిరించి అత్యాచారం చేసిన కేసులో ఆయన జైలుకెళ్లి ఇటీవలె బెయిల్?పై విడుదలయ్యారు. తీవ్రమైన నేరారోపణలు ఉన్నందున ఆర్టికల్ 311(2) బి కింద సర్వీస్ రిమూవల్ చేశారు. సర్వీస్ రిమూవల్ కోరుతూ హైదరాబాద్ సీపీ సీవీ

వివరాలు 2లో..

## నామినేషన్ దాఖలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి...



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న తాజా మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేడు నామినేషన్ వేశారు. ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి తరుణ్ చుగ్, బీజేపీ

వివరాలు 2లో..

## మోదీ జీ..! ఇదేం దుర్నీతి.. ఒక్క గుజరాత్‌కే రూ. 80 వేల కోట్లా..?



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రధాని నరేంద్ర మోదీపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బో యిన్‌పల్లి వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ఆరు నెలల కాలంలో సుమారు రూ. 80,000 కోట్ల దేశ సంపదను ఒక్క గుజరాత్ రాష్ట్రానికే తరలించారని, మోదీ విధానాలు కోపరేటివ్ ఫెడరలిజం స్ఫూర్తికి తూట్లు పొడిచే విధంగా ఉన్నా యని వినోద్ కుమార్ మండిపడ్డారు. భారతదేశం అంటే ఒక్క గుజరాత్ రాష్ట్రమే అన్న విధంగా ప్రధాని వ్యవహరిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టు వంటిదని

వివరాలు 2లో..

## తుది శ్వాస విడిచిన ములాయం సింగ్ యాదవ్

- గురుగ్రామ్ లోని మేదాంత ఆసుపత్రిలో కన్నుమూత
- ఫలించని వైద్యుల ప్రయత్నాలు
- ప్రతి ఒక్కరి నేత ఇక లేరంటూ అఖిలేశ్ యాదవ్ ట్వీట్



ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ ఈ రోజు ఉదయం కన్నుమూశారు. ఆగస్ట్ చివరి నుంచి గురుగ్రామ్ లోని మేదాంత హాస్పిటల్ లో ములాయం చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో ఈ నెల 2న ఆయన్ను ఐసీయూకు తరలించి వైద్యులు చికిత్స చేస్తున్నారు. రెండు రోజుల కిందటే పరిస్థితి మరింత విషమించింది. దీంతో ప్రాణాధార ఔషధాలతో చికిత్స చేస్తున్నారు. అయినా ఉపయోగం లేకపోయింది. "నా గౌరవ తండ్రి, ప్రతి ఒక్కరి నేత ఇక లేరు"అంటూ ములాయం కుమారుడు అఖిలేశ్ యాదవ్ సమాజ్ వాదీ పార్టీ ట్విట్టర్ హ్యాండిల్ పై చిన్న సందేశాన్ని హిందీలో పోస్ట్ చేశారు. 82 ఏళ్ల ములాయం సింగ్ యాదవ్ శ్వాస తీసుకోవడం కష్టంగా మారిందని, మూత్రనాళ ఇన్ఫెక్షన్ సైతం ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అఖిలేశ్ యాదవ్ తన భార్య డింపుల్ తో కలసి మేదాంత హాస్పిటల్ కు చేరుకున్నారు.

# తెలంగాణ సీఐడీ డీజీ గోవింద్ సింగ్ సతీమణి దుర్మరణం

-మొదటి పేజి తరువాయి

కలిసి గోవింద్ సింగ్ వెళ్లారు. మాతేశ్వరిని దర్శించుకున్న అనంతరం గోవింద్ సింగ్ సతీసమేతంగా తెలంగాణకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రామ్ గఢ్ సమీపంలో ఘంటియాలి మాత ఆలయం సమీపంలోకి రాగానే గోవింద్ సింగ్ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో షీలా సింగ్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న బీఎస్ఎఫ్ జవాన్లు అక్కడికి చేరుకుని గాయపడ్డ గోవింద్ సింగ్, ఆయన కారు డ్రైవర్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గోవింద్ సింగ్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# పోలీస్ శాఖ నుంచి సీఐ నాగేశ్వరరావు తొలగింపు

-మొదటి పేజి తరువాయి

ఆనంద్ రిక్రూట్‌మెంట్ అథారిటీకి లేఖ రాయగా..సీపీ లేఖను పరిగణలోకి తీసుకున్న పోలీస్ రిక్రూట్?మెంట్ అథారిటీ నాగేశ్వరరావును సర్వీస్ నుంచి తొలగించింది. పోలీస్ శాఖ హైదరాబాద్ లో 39 మందిని సర్వీస్ నుంచి తొలగించింది.

**నేరుగా ఇంటికెళ్లి అత్యాచారం**

జులై 6న తన ఫాంహౌస్ లో పనిచేస్తున్న మహిళకు నాగేశ్వరరావు వాట్సాప్ కాల్ చేసి తన కోరిక తీర్చాలని బెదిరించాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో నేరుగా హస్తినాపురంలోని ఆమె ఇంటికి వెళ్లి.. ఆమెపై దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన భర్త.. భార్య ఏడుపులు విని తలుపులు పగులగొట్టాడు. దాంతో సీఐ రివాల్వర్ ను బయటకు తీసి..చెప్పినట్లు వినకుంటే బ్రోతల్ కేసు పెడతానని దంపతులిద్దరిని బెదిరించి ఓ వెహికిల్‌లో ఎక్కించుకుని వనస్థలిపురం నుంచి ఇబ్రహీంపట్నానికి బయలుదేరాడు. ఇబ్రహింపట్నం సమీపంలోని చెరువు బ్రిడ్జి వద్ద కారు ప్రమాదానికి గురైంది. భార్యాభర్తలు అక్కడి నుంచి తప్పించుకుని వనస్థలిపురం వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో నాగేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేశారు.

# కారు గుర్తును పోలిన 8 గుర్తులను తొలగించండి... తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారికి టీఆర్ఎస్ వినతి

- ఫ్రీ సింబల్స్ జాబితాలో కారును పోలిన 8 గుర్తులు
- వాటి కారణంగా తమకు నష్టం కలుగుతోందంటున్న టీఆర్ఎస్ నేతలు
- ఆ గుర్తులను తొలగించాలంటూ వికాస్ రాజ్‌కు వినతి పత్రం

మునుగోడు ఉప ఎన్నికల్లో పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికార పార్టీ టీఆర్ఎస్ సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌ను కలిసింది. ఎన్నికల్లో టీఆర్ఎస్ గుర్తు కారును పోలిన గుర్తులు 8 ఉన్నాయని, వాటిని ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించాలని కోరింది. ఈ మేరకు సోమవారం టీఆర్ఎస్ ప్రతినిధి బృందం వికాస్ రాజ్‌కు ఓ వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ కారును పోలిన గుర్తులను ఇతర అభ్యర్థులకు కేటాయిస్తుండటంతో తమ పార్టీని నష్టం జరుగుతోందని తెలిపారు. గతంలో ఇలాగే కారును పోలిన గుర్తుల కారణంగా టీఆర్ఎస్‌కు ఓటు వేయాలనుకున్న వారు కూడా ఆ గుర్తులకు ఓటేశారని, ఫలితంగా తమ పార్టీ ఖాతాలో పడాల్సిన ఓట్లు... కారును పోలిన గుర్తు కలిగిన అభ్యర్థులకు వెళ్లిపోయాయని చెప్పారు. ఈ తరహా పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేలా కారును పోలిన గుర్తును ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు.

# టీఆర్ఎస్, బీజేపీల చీకటి దోస్తీ బట్టబయలైంది



టీఆర్ఎస్, బీజేపీల చీకటి దోస్తీ ప్రజలకు అర్థమైపోయిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. " బీజేపీ మంత్రాలతో చింతకాయలు రాలవు. టీఆర్ఎస్ తంత్రాలతో ప్రజల సమస్యలు తీరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ గజకర్ణ గోకర్ణ టక్కు టమార డ్రామాలు మాని రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలన, ప్రజా సమస్యలపై దృష్టిసారిస్తే మంచిది' అని సూచించారు. ఈమేరకు ఆయన ఓ ట్వీట్ చేశారు. టీఆర్ఎస్, బీజేపీలకు ప్రజా క్షేత్రంలో తగిన శాస్తి తప్పదన్నారు. మునుగోడు బై పోల్ లో కాంగ్రెస్ వైపు నిలబడాలని ప్రజలను కోరారు.

# నేను బయటనే మంత్రిని... ఇంట్లో కాదు

-మొదటి పేజి తరువాయి

స్పందించారు. ఓటర్లకు మందు పోసి ప్రలోభపెట్టాల్సిన ఖర్మ తమకు లేదని, మునుగోడు ప్రజలు టీఆర్ఎస్ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. తాను ఓటర్లకు మందు పోయలేదని, తమ బంధువులకు మాత్రమే పోశానని తెలిపారు. తన బావ ఇంట్లో ఫంక్షన్ ఉందంటే వెళ్లానని, అక్కడ తెలిసిన చుట్టాలకు మందు సర్వ్ చేశానని స్పష్టం చేశారు. ఓ మంత్రిగా ఉండి అలా మందు పోయొచ్చా అని తనను ట్రోల్ చేస్తున్నారని, తనకు పర్సనల్ లైఫ్ ఉండదా అని మంత్రి ప్రశ్నించారు. "నాపై ఆరోపణలు చేస్తున్నవాళ్లు వాళ్ల ఇళ్లల్లో మందు తాగడం లేదా? వాళ్ల ఫోటోలను ఇలాగే మీడియాలో వైరల్ చేస్తున్నారా?" అంటూ మల్లారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. తాను బయట మాత్రమే మంత్రినని, ఇంట్లో తనకు పర్సనల్ జీవితం ఉంటుందని చెప్పారు. అయినా తానేమైనా పబ్లిక్ లో మందు పోశానా అంటూ మంత్రి ప్రశ్నించారు.

**రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి రూ.18 వేల కోట్ల కాంట్రాక్ట్ తీసుకోలేదా?**

మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ ప్రభుత్వం నుంచి రూ.18 వేల కోట్ల కాంట్రాక్ట్ పొందలేదా అని మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. స్వయంగా రాజగోపాల్ రెడ్డే తాను బీజేపీ నుంచి కాంట్రాక్ట్ తీసుకున్నానని చెప్పారని అన్నారు. రాజగోపాల్ రెడ్డి స్వార్థం వల్లే ఇవాళ మునుగోడు ఎన్నికలు వచ్చాయి తప్ప మరేం కాదన్నారు. ఉప ఎన్నికల పేరుతో సీఎం కేసీఆర్ ను ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ నాయకులు రాజగోపాల్ రెడ్డితో రాజీనామా చేయించారని ఆరోపించారు.

# ఆ ముగ్గురు వైద్య రంగానికి మూలస్తంభాలు

-మొదటి పేజి తరువాయి

స్త్రీలకు ఈ న్యూట్రిషన్ కిట్ అందజేయడం జరుగుతుందన్నారు. గర్భిణీ స్త్రీకి అవసరమైన స్కానింగ్‌లు చేయించాలని సూచించారు. 56 టిఫా స్కాన్ యంత్రాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ యంత్రాలు నిర్వహించే తీరుపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. టిఫా స్కాన్ మిషన్లు వినియోగించి నాణ్యమైన వైద్యం తల్లిపిల్లకు అందించాలి. స్కానింగ్‌ల కోసం బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. డెలివరీ తేదీని ముందే గుర్తించి 104 వాహనంలో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు.

**ఆ జిల్లాల్లో ప్రయివేటు ఆస్పత్రుల్లోనే అధికంగా డెలివరీలు..**

నిజామాబాద్, సూర్యాపేట, హనుమకొండ, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో ప్రయివేటు ఆస్పత్రుల్లోనే అధికంగా డెలివరీలు జరుగుతున్నాయని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో 45 శాతానికి పైగా డెలివరీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరు జిల్లాల వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా డీఎంహెచ్‌వోలు సమీక్ష జరపాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

**మెదక్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే 80 శాతం డెలివరీలు..**

మెదక్ జిల్లాలో 80 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. మెదక్, ములుగు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం డెలివరీలు జరిగినప్పుడు, మిగతా జిల్లాల్లో ఎందుకు జరగడం లేదు. ఈ అంశంపై డీఎంహెచ్‌వోలు, సూపర్ వైజర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు దృష్టి సారించాలని ఆదేశించారు. కొత్తగా ఎంసీహెచ్ ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక వైద్య సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వందకు వంద శాతం డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీ సెక్షన్లను అరికట్టాలని సూచించారు. తల్లిబిడ్ ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు నిర్ధారిస్తే తప్ప సీ సెక్షన్లు జరగకుండా చూడాలన్నారు. నార్మల్ డెలివరీలు చేయడానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**మిడ్ వైఫరీ నర్సులకు త్వరలోనే పోస్టింగ్స్**

133 మంది మిడ్ వైఫరీ నర్సులు 18 నెలల శిక్షణను పూర్తి చేసుకున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. వారు విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.. త్వరలోనే పోస్టింగ్స్ ఇస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, వైద్యఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మోదీ జీ..! ఇదేం దుర్నీతి.. ఒక్క గుజరాత్‌కే రూ. 80 వేల కోట్లా..?

-మొదటి పేజి తరువాయి

పేర్కొన్నారు. ఇదే నా.. మీ కోపరేటివ్ ఫెడరలిజం నీతి..? అని వినోద్ కుమార్ ప్రశ్నించారు. దేశంలో 28 రాష్ట్రాలు ఉంటే.. కేవలం ఒక్క గుజరాత్ రాష్ట్రానికే వేలాది కోట్ల రూపాయలు తరలించడం ఎంత వరకు సమంజసం అని వినోద్ కుమార్ ప్రధాని మోదీని సూటిగా ప్రశ్నించారు. వచ్చే డిసెంబర్ నెలలో గుజరాత్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో దేశ సంపదను ఒక్క గుజరాత్ రాష్ట్రానికే తరలించడం ఎంత వరకు సబబు అని వినోద్ కుమార్ అడిగారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసే విషయం గురించి ప్రధాని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాలను పూర్తిగా విస్మరిస్తోందని, అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందని వినోద్ కుమార్ దుయ్యబట్టారు.

**స్వశక్తితో తెలంగాణ ముందుకు దూసుకెళ్తోంది..**

కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోయినప్పటికీ.. నరేంద్ర మోదీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు ఇవ్వకపోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో స్వశక్తితో ముందుకు దూసుకెళ్తుందని వినోద్ కుమార్ తెలిపారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోయినా.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా.. ఇతరత్రా సహకారం అందించకున్నా.. స్వశక్తితో తెలంగాణ రాష్ట్రం ముందుకు దూసుకెళ్తున్నదని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

# ములాయం అంత్యక్రియలకు హాజరుకానున్న సీఎం కేసీఆర్

-మొదటి పేజి తరువాయి

కొనియాడారు. ప్రముఖ సోషలిస్టు నాయకులు రామ్ మనోహర్ లోహియా, స్వాతంత్ర్య సమరయోధులు రాజ్ నారాయణ్ వంటి నేతల స్ఫూర్తితో ములాయం రాజకీయాల్లోకి వచ్చారని సీఎం గుర్తు చేసుకున్నారు. ములాయం కుమారుడు అఖిలేష్ యాదవ్, వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# నామినేషన్ దాఖలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి...

-మొదటి పేజి తరువాయి

తెలంగాణ చీఫ్ బండి సంజయ్ తదితర నేతలు ఉన్నారు. నామినేషన్ అనంతరం రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ భవిష్యత్తును మునుగోడు ఉప ఎన్నిక నిర్దేశిస్తుందని అన్నారు. మునుగోడులో తనపై ఎవరు పోటీకి వస్తారో రావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ వస్తారా? కేటీఆర్ వస్తారా?... ఎవరొచ్చినా విజయం నాదే అంటూ ధీమా వ్యక్తం చేశారు. "లక్షల కోట్ల మేర ప్రజల సొమ్ము దోచుకున్న మిమ్మల్ని వదిలేది లేదు... వచ్చే ఏడాది బతుకమ్మ నాటికి కవిత జైలుకెళ్లడం ఖాయం" అని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికకు ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదలైంది. దాంతో నామినేషన్ల పర్వం షురూ అయింది. ఈ నెల 14న నామినేషన్ల దాఖలుకు తుది గడువు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 17వరకు అవకాశం ఇచ్చారు. నవంబరు 3న పోలింగ్, 6వ తేదీన ఫలితాల వెల్లడి ఉంటుంది. కాగా, టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఈ నెల 12న, కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఈ నెల 14న నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని తెలుస్తోంది. అటు, ఈ ఉప ఎన్నికలో టీడీపీ తన అభ్యర్థిని బరిలో దించేదీ, లేనిదీ మరికొన్నిరోజుల్లో తేలనుంది.

# మునుగోడు జన బలం.. ధన బలంకు మధ్యనే పోటీ

అక్రమ కాంట్రాక్టులతో రాజగోపాల్ రెడ్డి సంపాదించిన ధన బలంకి, మునుగోడు ప్రజల జన బలంకు మధ్యనే ఈ పోటీ జరుగుతుందని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి తరుపున మునుగోడులో ప్రచారానికి వెళ్లిన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన కేటీఆర్, కాంట్రాక్టులతో రాజగోపాల్ రెడ్డి సంపాదించిన ధన బలంకి మునుగోడు ప్రజల జన బలంకి మధ్య జరుగుతున్న ఎన్నిక ఇదని కేటీఆర్ అన్నారు. వేలకోట్ల రూపాయల అక్రమ కాంట్రాక్టులతో సంపాదించిన ధనబలంతో జనాలను పట్టించుకోకుండా ఇన్నాళ్లుగా నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిన వ్యక్తి ఈరోజు ఉప ఎన్నికల కోసం వచ్చారని కేటీఆర్ విమర్శించారు. రాజగోపాల్ రెడ్డి ధన దాహం, వేల కోట్ల రూపాయల ఆయన కాంట్రాక్టుల కోసమే వచ్చిన ఎన్నిక ఇదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని మంత్రి కేటీఆర్ టీఆర్ఎస్ కార్యకర్తలను కోరారు.

ఈ నాలుగు సంవత్సరాల కాలంలో తాను ప్రాతినిథ్యం వహిస్తున్న మునుగోడు నియోజకవర్గాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్న కేటీఆర్, ఆయన ఒక అట్టర్ ఫ్లాఫ్ ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజల కష్ట సుఖాలను ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం తన కాంట్రాక్టుల గురించి మాత్రమే ఆలోచించే ఫక్తు రాజకీయ వ్యాపారి రాజగోపాల్ రెడ్డి అని కేటీఆర్ విమర్శించారు. నియోజకవర్గ సమస్యలను వదిలేసి అసెంబ్లీలో కాంట్రాక్టర్ల బిల్లుల కోసం మాట్లాడిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వేల కోట్ల రూపాయల కాంట్రాక్టు కోసమే రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరారని కేటీఆర్ విమర్శించారు. రాజగోపాల్ రెడ్డి ధన దాహంతోనే ఈ ఉప ఎన్నిక మునుగోడు ప్రజల మీద బలవంతంగా రుద్దబడిందన్నారు.



కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం అనేక హామీలిచ్చి వాటిలో ఏ ఒక్కదాన్ని నెరవేర్చకుండా చేతులెత్తేసిన రాజగోపాల్ రెడ్డి ఈ ఉప ఎన్నిక సందర్భంగా మరోసారి ప్రజలను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. బీజేపీ ఇచ్చిన వేల కోట్ల రూపాయల కాంట్రాక్టు కమీషన్ పైసలతో బైకులు, కార్లతో పాటు ఇతర విలువైన వస్తువులను ఓటర్లకు రాజగోపాల్ రెడ్డి పంచుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇంకో సంవత్సరం పాటు పదవి కాలం ఉన్నా, ఉప ఎన్నిక స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నిక తెచ్చారని, అయితే చైతన్యవంతులైన మునుగోడు ఓటర్లు బిజెపికి రాజగోపాల్ రెడ్డికి ఈ ఉప ఎన్నికలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ చెప్పారు. ఒకవైపు బిజెపి రాజగోపాల్ రెడ్డి కాంట్రాక్టు వ్యవహారాన్ని ఆయన విఫలమైన విధానాన్ని ప్రజలకు వివరిస్తూనే టీఆర్ఎస్ పార్టీ గత ఎనిమిది సంవత్సరాలు రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి చేసిన కార్యక్రమాలను వివరించాలని ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు.

# మునుగోడులో బీజేపీకి బంపర్ ఆఫర్ ఇచ్చిన మంత్రి జగదీశ్ రెడ్డి

- మునుగోడు అభివృద్ధికి రూ.18 వేల కోట్ల నిధులు ఇవ్వాలన్న జగదీశ్ రెడ్డి
- ఆ నిధులిస్తే పోటీ నుంచి టీఆర్ఎస్ తప్పుకుంటుందని వెల్లడి
- కేసీఆర్‌ను ప్రాధేయపడి అయినా ఒప్పిస్తామంటూ ప్రకటన



మునుగోడు ఉప ఎన్నికలకు సంబంధించి బీజేపీకి టీఆర్ఎస్ కీలక నేత, మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం ఓ బంపర్ ఆఫర్ ఇచ్చారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి రూ.18 వేల కోట్ల నిధులు ఇస్తే... ఉప ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటామని ఆయన ప్రకటించారు. ఈ విషయంలో తమ డిమాండ్ మేరకు కేంద్రంలోని బీజేపీ సర్కారు మునుగోడుకు రూ.18 వేల కోట్ల నిధులు మంజూరు చేస్తే... పోటీ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిని తప్పిస్తామని ఆయన చెప్పారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్‌ను ప్రాధేయపడి అయినా తాము ఒప్పిస్తామని జగదీశ్ రెడ్డి చెప్పారు. తన సంస్థకు రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు దక్కిందంటూ బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా చెప్పినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, జగదీశ్ రెడ్డి ఈ ఆఫర్ ప్రకటించారన్నవాదన వినిపిస్తోంది.

# దంచికొట్టింది.. నగరంలో భారీ వర్షం

హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. నగరంలోని బంజా రాహిల్స్, జూబ్లీహిల్స్, మా దాపూర్, కొండాపూర్, ఖైరతా బాద్, అమీర్‌పేట, సోమాజిగూడ, సికింద్రాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు వేడెక్కిన వాతావరణం సాయం త్రం ఒక్కసారిగా చల్లబడింది. ఒక్కసారిగా కుండపోత వర్షం కుసింది. దీంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. మ్యాన్ హోళ్లు పొంగిపొ ర్లుతు న్నాయి.



# హైదరాబాద్ ఎఎస్ రావు నగర్‌లో 11వ అవుట్‌లెట్‌ను ప్రారంభించిన అబ్సల్యూట్ బార్బెక్యూస్.....

- అవుట్‌లెట్‌ను ప్రారంభించిన యాప్రాల్‌లోని స్వచ్ఛంద సంస్థ ఓమీస్ హెూమ్ ఫర్ చిల్డ్రన్‌కు చెందిన చిన్నారులు..

**(కాప్రా / శుభ తెలంగాణ)** ఎబిస్‌కు నూతనంగా ప్రారంభించిన రెస్టారెంట్ తో కలిపి 60 అవుట్‌లెట్‌లు ఉన్నాయి మరియు ఈ ఆర్థిక సంవత్సరాంతానికి వంద అవుట్‌లెట్‌ల దిశగా పయనిస్తున్నది హైదరాబాద్, అక్టోబర్ 2022 భారతదేశంలో ఎబిస్‌గా ప్రసిద్ధి చెందిన ఆహార ప్రియులు ఎంతగానో ఇష్టపడే బిబిక్యూ బఫే రెస్టారెంట్ అబ్సల్యూట్ బార్బెక్యూస్, హైదరాబాద్‌లో తన 11వ అవుట్‌లెట్‌ను ఎంతో రద్దీగా ఉండే ఎఎస్ రావు నగర్‌లో ప్రారంభించడం ద్వారా మరో మైలురాయిని చేరుకుంది. యాప్రాల్‌లోని స్వచ్ఛంద సంస్థకు చెందిన ఓమీస్ హెూమ్ ఫర్ చిల్డ్రన్‌కు చెందిన చిన్నారులు ఈ అవుట్‌లెట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఎఎస్ రావు నగర్‌లో ఏర్పాటైన ఈ నూతన ఎబిస్, ఎఎస్ రావ్ నగర్ మరియు దాని పరిసర ప్రాంతాలలో ఉండే ఆహార ప్రియులను ఆకర్షించడానికి ఖరీదైన మరియు ప్రీమియం ఇంటీరియర్‌తో సర్వసన్నద్ధమైంది. రెస్టారెంట్ 108 సీటింగ్ సామర్ధ్యంతో ఎంతో విశాలంగా ఉన్నది.

హైదరాబాద్ నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఎబిస్, నగరంలో తన పదకొండవ అవుట్‌లెట్‌ను ప్రారంభించడం మాకు ఎంతో ముఖ్యమైన సందర్భం. హైదరాబాద్‌లోని మంచి ఆహార అభిరుచులు కలిగిన ఆహార ప్రియులు ఎల్లప్పుడూ ఎబిస్‌ను ఆదరించి, ఎబిఎస్ ఒక జాతీయ బ్రాండ్‌గా మారడంలో మమ్మల్ని ఎంతగానో ప్రోత్సాహిస్తున్నారు. కాస్మోపాలిటన్ జనాభా మంచి వాతావరణం కలిగిన ఎఎస్ రావు నగర్‌లో ఎబిస్‌కు భవిష్యత్తులో ఆదరణ బాగా ఉంటుదని మేము ఎల్లప్పుడూ భావిస్తూ వచ్చాము మరియు ఎఎస్ రావు నగర్ పరిసరాల్లో ఒక అవుట్‌లెట్ ఉండాలనే ఆ ప్రాంతానికి చెందిన ఆహార ప్రియుల నుండి పెరుగుతున్న డిమాండ్ మా నిర్ణయాన్ని మరింత వేగవంతంగా అమలు చేయడంలో మమ్మల్ని ప్రేరేపించింది. ఎబిస్ విష్ గ్రిల్ కాన్సెప్ట్‌కు ప్రసిద్ధి చెందాయి, ఇక్కడ మీరు మీ మరియు మీ కుటుంబ సభ్యుల అభిరుచికి అనుగుణంగా ఆహారాన్ని సిద్ధం చేసి అందించవచ్చు. ఎబిస్ అన్ని రకాల వేడుకలకు కూడా ప్రసిద్ధి చెందాయి, పుట్టినరోజు, పెళ్లి వార్షికోత్సవం లేదా సహ%–



–%ఉద్యోగులతో విందు వంటి ఎటువంటి సందర్భమైనా కావచ్చు, అటువంటి ముఖ్యమైన సందర్భాలు జరుపుకునే ప్రత్యేకత కారణంగా, ఎబిస్ సేవలకు నగరంలో చర్చనీయాంశంగా మారింది, చాలా మందికి ఇంటి నుండి దూరంగా ఉన్న మరో ఇల్లులా ఉంటుంది, ఇక్కడ మేము మా అతిథులను ఇళ్లలో చేసినట్లుగా వారి జిహ్వ చాపల్యాన్ని సంతృప్తి పరుస్తాము. మొత్తంమీద ఎబిస్ ఆకట్టుకునే భోజన అనుభవం అందిస్తుంది, ఇది మా కస్టమర్లకు ఆనందాన్ని కలిగిస్తుంది, ఇది మా 60వ ఔట్‌లెట్, మరో 40 ఔట్‌లెట్లను ప్రారంభించి ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మొత్తం 100 ఔట్‌లెట్లకు చేరుకోవాలనేది మా ఆకాంక్ష ఎబిస్ – ఎపి %ఽ% టిఎస్, టెరిటరీ మేనేజర్ ఆపరేషన్స్, అభిలాష్ కుమార్ యలమంచిలి అన్నారు. అబ్సల్యూట్ బార్బెక్యూ ప్రైవేట్ లిమిటెడ్ గురించి: అబ్సల్యూట్ బార్బెక్యూస్, బిబిక్యూ బఫే రెస్టారెంట్ చైన్ ప్రధాన కార్యాలయం భారతదేశంలోని హైదరాబాద్‌లో ఉంది. 2013లో రెస్టారెంట్ ప్రొసెంజిత్ రాయ్ చౌదరి తన సహ వ్యవస్థాపకుడు మాధవన్ గురుదాస్‌తో కలిసి ప్రారంభించారు. బ్రాండ్ భారతదేశంలో 50 అవుట్‌లెట్‌లను కలిగి ఉంది మరియు 20 నగరాలను కవర్ చేస్తుంది. రెస్టారెంట్ చైన్ దుబాయ్‌లో మూడు అవుట్‌లెట్‌లతో అంతర్జాతీయ ఉనికిని కలిగి ఉంది. భారతదేశపు మొదటి విష్ గ్రిల్ రెస్టారెంట్ అనే క్రెడిట్‌తో, ఎబిస్ భారతీయ, కాంటినెంటల్ మరియు అన్యదేశ ఆఫర్‌లను కలిగి ఉన్న ఆల్-యు-కెన్-ఈట్ బఫేను అందిస్తుంది. రెస్టారెంట్ టైమ్స్ ఫుడ్ అవార్డ్స్, అత్యధిక రేటింగ్ పొందిన రెస్టారెంట్‌కి జోమాటో యూజర్ పాపులారిటీ అవార్డు మరియు గోల్డెన్ ప్లేట్ అవార్డులతో సహా పలు అవార్డులను కూడా గెలుచుకుంది.

మరింత సమాచారానికి దయ చేసి సంప్రదించండి: 9963980259 / 9391355650.

# పేదల కష్టాలలో బిఎల్ఆర్ ట్రస్ట్ పాలుపంచుకుంటుంది

బి ఎల్ ఆర్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్



**(కుషాయిగూడ /శుభ తెలంగాణ)** పేదల కష్టాలలో బిఎల్ఆర్ ట్రస్ట్ పాలుపంచుకుంటూ ముందుంటుందని బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన శివ సాయి నగర్ కు చెందిన వెంకట చారి కుటుంబ సభ్యులకు సోమవారం బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ట్రస్ట్ ప్రతినిధి మహేష్ గౌడ్ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీలు పాడైపోయి మంచం పట్టిన శివ సాయి నగర్ కు చెందిన డిగ్రీ విద్యార్థిని భువనేశ్వరికి గతంలో ఆర్థిక సాయం చేయడం జరిగిందని గుర్తుచేస్తూ ఆమెకు డయాలసిస్ కోసం బి ఎల్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్, శివ సాయి నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంపల్లి పద్మా రెడ్డి, అనంత చారి, రవీందర్ రెడ్డి, గిరి, మహేందర్, సైదా నాయక్, శ్రీనివాస్, పిట్టల వెంకటేష్, రవికుమార్, అశోక్, జయ, కవిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కి వినియోగదారుల ఫిర్యాదు... వెంటనే స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు...

- దుకాణాలపై, మార్ట్స్ పై ఏ ఎం హెచ్ ఓ ఆకస్మిక తనిఖీలు..



**(కాప్రా /శుభ తెలంగాణ)** నాణ్యతా లేని, గడువు ముగిసిన, కల్తీ ఆహార పదార్థాల అమ్మకాలు జరిపే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం, అటువంటి దుకాణాలను సీజ్ చేస్తాం అనిజిహెచ్ఎంసి ఏ ఎమ్ హెచ్ ఓ డాక్టర్. స్వప్నా రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారుల ఫిర్యాదు తో సోమవారం హైదరాబాద్ లోని కాప్రా డివిజన్ జమ్మిగడ్డ లోని"రిలియన్స్ సూపర్ స్మార్ట్" మాల్ పై ఏ ఎం హెచ్ ఓ సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు చేసారు. దుకాణంలో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ఐస్ క్రీములు, ఖజ్జూరాలు, అపరిశుభ్రంగా నిబంధనలకు విరుద్ధంగా చేసిన పదార్థాల నిల్వలను గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. రూ. 50,000 ఫైన్ వేశారు. ఈ కార్యక్రమంలో జవాన్లు రామ కృష్ణ, అశోక్, ఎస్ఎఫ్ఏ కుమార్, కాలనీ వాసులు అల్లురయ్య, ఎస్. శ్రవణ్ కుమార్, పి. కుమార్, నర్సింహాలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం

-జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కు టీడబ్ల్యూజేఎఫ్ నేతలు వినతి




**సంగారెడ్డి /శుభ తెలంగాణ)** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 10న 'డిమాండ్స్ డే' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, అనంతరం కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ కు వినతిపత్రాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వొచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో గత కొన్ని ఏండ్లుగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వలేదని చెప్పారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలను మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'డిమాండ్స్ డే'ను చేపట్టినట్టు వివరించారు. జర్నలిస్టులకు ప్రస్తుతం ఆర్టీసీ ఇస్తున్న 75 శాతం రాయితీ సరిగ్గా అమలుకావడం లేదని అన్నారు. డీజిల్ సెస్, టోల్ గేట్ల ఫీజులతో రాయితీ కేవలం 50 శాతం మాత్రమే అమలవుతున్నదని తెలిపారు. పెరిగిన ధరల నేపథ్యంలో జర్నలిస్టులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, రాయితీని పూర్తిగా అమలుచేస్తూనే బస్సుపాసు సౌకర్యాన్ని జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు కూడా వర్తింపజేయాలని కోరారు. పేదలైన జర్నలిస్టులను ఆదుకునేందుకు 'జర్నలిస్టు బంధు' ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే కరోనా కాలంలో ఎత్తేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలనీ, రాయితీని వంద శాతానికి పెంచాలని కోరారు. ఈ సౌకర్యాన్ని కూడా జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతూ జిల్లా కలెక్టర్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వమూ లేఖలు రాసి రైల్వే పాసులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు జిల్లాల్లో అక్రిడేషన్ కమిటీ సమావేశం ను వెంటనే నిర్వహించాలని. జర్నలిస్టుల అందరికి అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సురేందర్, కోశాధికారి నర్సింహ రెడ్డి, జాతీయ నాయకులు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పాండు, జిల్లా సహాయ కార్యదర్శులు మహబూబ్ అల్లి, రాయికోటి నర్సిములు శరత్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు దండు ప్రభు, బాలరాజు శ్రీధర్ కుమార్, షౌకత్ అల్లి, యాదగిరి, సంగారెడ్డి డివిజన్ కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు బక్క రవీందర్, గైని దేవదాస్, నాయకులు అశోక్ రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ లో వీధి కుక్కల స్వైర విహారం

ఒకటో డివిజన్ ప్రజల భయాందోళన



**(జవహర్ నగర్/శుభ తెలంగాణ)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీ 1వ డివిజన్ మల్కారం లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ విచ్చలవిడిగా అక్కడ ప్రజలను కరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సోమవారం ఉదయం స్కూలుకు వెళ్తున్న విద్యార్థిపై దాడి చేసి విచక్షణ రహితంగా గాయపరిచాయి. పనుల కోసం వెళ్తున్న ఒక పేద కార్మికున్ని కూడా గాయపరిచాయి. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసిన ఫలితం లేదని వారి నిర్లక్ష్యం మూలంగానే వీధి కుక్కలు సంచరిస్తూ పనులు చేసుకుంటున్నా పేద కార్మికులను, విద్యార్థి విద్యార్థులను, చిన్న పిల్లలను గాయపరచడంతో అక్కడి కాలనీవాసులు నిత్యం భయాందోళనకు గురవుతున్నామని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వీధి కుక్కల బారి నుండి తమ సమస్యను పరిష్కరించాలని వాపోతున్నారు.

# నేర నియంత్రణ - నేర పరిశోధనకు



ఎల్బీనగర్ రాచకొండ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీలో 35 లక్షల రూపాయలతో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,

- సిసి కెమెరాలు సహాయపడతాయి
- సిపి రాచకొండ మహేష్ భగవత్
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిపి మహేష్ భగవత్, టిఎస్ఐఐసి వైస్ చైర్మన్ ఇవి. నరసింహారెడ్డి, ఎల్బీనగర్ డిసిపి సన్ ప్రీత్ సింగ్ పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు.

సీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ.. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కుంట్లూరు ఏరియాలో టీఎస్ఐఐసి వారి సహకారంతో 30 లక్షల రూపాయలతో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని మహేష్ భగవత్ తెలిపారు. రాచకొండ పరిధిలో క్రైమ్ తగ్గిందని మహేష్ భగవత్ అన్నారు. సీసీ కెమెరాల విషయంలో ప్రజలు ముందుకు రావాలని మహేష్ భగవత్ కోరారు. ప్రతి ఒక్క కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని మహేష్ భగవత్ అన్నారు. కొత్తగా వెంచర్లు లేవాట్లు చేసేవారు సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్య తీసుకోవాలని మహేష్ భగవత్ అన్నారు. కుంట్లూరులో గతంలో చెడ్డి గ్యాంగ్ హల్చల్ చేసినందున కెమెరాలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులతో కలిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలు ఉంటే నేరం చేసేవారి సంఖ్య తగ్గుతుందని నేరాలు చేసిన అంతకులని పట్టుకోవడానికి కెమెరాలు సహకరిస్తాయని సిపి మహేష్ భగవత్ తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ కమిషనర్ రేట్ పరిధిలోని హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఏరియాలో ఐదు కాలనీలలో 50 కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్త కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం దొంగతనాలు జరగకుండా ఉండడానికి ప్రజలకు కొంచెం ధైర్యాన్ని ఇస్తుందని ఎమ్మెల్యే అన్నారు. టీఎస్ఐఐసి వారి ఆధ్వర్యంలో 50 కెమెరాలు ఏర్పాటు చేసినందుకు టీఎస్ఐఐసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సిపి మహేష్ భగవత్ వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు క్రైమ్ రేట్ తగ్గిందని సిపి మహేష్ భగవత్ కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు, ప్రజలు అధికారులు రాజకీయ నాయకులు అందరు కలిసి కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసిపి పురుషోత్తం రెడ్డి, ఐటీ సెల్ స్పెషల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై సునీల్, హయత్ నగర్ ఇన్స్పెక్టర్ హెచ్. వెంకటేశ్వర్లు, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ చైర్మన్ చెవుల స్వప్న, మున్సిపల్ కమిషనర్ రామంజుల రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ తెరాస పార్టీ అధ్యక్షులు వేముల అమరేందర్ రెడ్డి, పెద్ద అంబర్పేట్ కౌన్సిలర్లు సిహెచ్. మురళీధర్ రెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్, సిద్ధంకి కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీ రాజు, మండల కోటేశ్వరరావు, తుర్కయంజాల్ కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, తాళ్లపల్లి సంగీత మోహన్ గుప్త, మున్సిపాలిటీ ప్రజలు నాయకులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చు సూర్యాపేట జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

- అయితబోయిన రాంబాబు ఆధ్వర్యంలో పాత్రికేయుల సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ యూనియన్ నాయకులు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ విన్నపాలను జిల్లా కలెక్టర్కు అందజేశారు ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను శాఖల వారీగా జిల్లా అధికారులకు అందజేసి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు ఈరోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్స్ సమస్యలపై 49 దరఖాస్తులు అందజేశారని భూ సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు నుండి 22 దరఖాస్తులు వివిధ సమస్యలపై వచ్చాయని తెలిపారు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ పాత్రికేయులు తమ సమస్యలపై ప్రజావాణిలో యూనియన్ అధ్యక్షులు ఆయితబోయిన రాంబాబు సభ్యులు జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు అందజేశారు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లవలసిందిగా జిల్లా కలెక్టర్ ను వారు కోరారు



ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ యస్ మోహన్ రావు అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నరసయ్య కు నివాళు లర్పించిన సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు



మండలంలోని రంగంబంజర గ్రామంలో ఎల్లంకి నరసయ్య దశదినకర్మకు గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు హాజరై నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈకార్యక్రమంలో పేరసాని వెంకటయ్య,కూచిపూడి రమేష్,రాయల సీతారామారావు,పేరసాని సత్యనారాయణ,అమరనేని సత్యనారాయణ,ఆలస్యం బుచ్చయ్య,దొడ్డపిన్ని నాగేశ్వరరావు,దిరిశాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి కుప్పకూలిన ఇల్లు...



**బచ్చన్నపేట్)** జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మల్యాల సత్తెమ్మ కుమారుడైన జంపయ్య ఇల్లు కూలిపోవడంతో కుటుంబం రోడ్డున పడ్డాది. కూలిపోయిన ఇంటిని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కోడూరి మహాత్మాచారి సందర్శించి మల్యాల సత్తెమ్మ నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని,ఆ కుటుంబానికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేసి వెంటనే కట్టించి ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఓబీసీ వైస్ చైర్మన్ చెరుకూరి శ్రీనివాస్,



ఎంపీటీసీ పుష్ప బాల కిషన్ గౌడ్,ఎంపీటీసీ అల్వాల రాధా ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు దిడ్డిగా రమేష్,మిన్నాలాపురం సిద్ధులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

## నున్నా లక్ష్మయ్యకు నివాళు లర్పించిన టి.ఆర్.యస్ నాయకులు



**అక్టోబర్ 10, తల్లాడ)**తల్లాడ పట్టణానికి చెందిన నున్నా లక్ష్మయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఆయన దశ దిన కార్యక్రమం సోమవారం నిర్వహించారు, ఈకార్యక్రమానికి టి.ఆర్. యస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి,వైరా వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు దూపాటి భద్రరాజు,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దగ్గుల రాజశేఖర్ రెడ్డి,టి.రాయల నరసింహరావు,హాజరై లక్ష్మయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వీఆర్ఏల దీక్షపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి...



- తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన...

**మండల రిపోర్టర్ జేరిపోతుల రమేష్)** వీఆర్ఏల దీక్షపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని విఆర్ఎల మండల అధ్యక్షులు ఏదురామకృష్ణ అన్నారు.సోమవారం రోజు జనగాం జిల్లా బచ్చన్నపేట మండల తహశీల్దార్ కార్యాలయానికి విఆర్ఏ లు తహసిల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన కార్యక్రమాన్ని చెపట్టారు.ఈ సందర్భంగా విఆర్ఏల మండల అధ్యక్షులు ఏదు రామకృష్ణ మాట్లాడుతూ... తమ న్యాయ్యంమైన డిమాండ్లను పరిశీలించేందుకు, ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 55 సంవత్సరాలు నిండిన వి ఆర్ ఏల స్థానంలో వారసులకు విఆర్ఏ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. మరణించిన వి ఆర్ ఏల స్థానంలో కారుణ్య నియామకం చేపట్టాలని, తమకు పే స్కెల్ ఇవ్వాలని కోరారు. విఆర్ఏల పే స్కేల్ జి ఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అర్హత కలిగిన విఆర్ ఏ లకు పదోన్నతులు కల్పించాలని, తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 78 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టిన తమ దీక్షపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన చెందారు.రాష్ట్ర జాక్ పిలుపు మేరకు 78 వ రోజు సమ్మెలో భాగంగా తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు గోపాల్,గౌతమి,సుమలత, మమత,శ్రీనివాస్, లక్ష్మి, బాలయ్య,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు...

## చీకటి కాంతయ్యకు నివాళులర్పించిన ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు.



**తల్లాడ)మండలంలోని** అన్నారుగూడెం గ్రామంలో వార్డ్ మెంబర్ చీకటి నరసింహారావు తండ్రి చీకటి కాంతయ్య (80) ఇటీవల అనారోగ్యంతో మరణించారు సోమవారం ఆయన దశదిన కార్యక్రమానికి ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై కాంతయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు,కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దిరిశాల ప్రమీల,టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కోవెల కృష్ణయ్య, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు, టిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు,టిఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మన్ దిరిశాల దాసురావు,టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు,రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు దుగ్గినేని సత్యనారాయణ,నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, హనుమంతురావు,ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- డిమాండ్స్ డే సందర్బంగా ప్రజావాణిలో దరఖాస్తు
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం
- తెలంగాణ స్టేట్ జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్స్ డే సందర్భంగా సోమవారం ప్రజావాణిలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ కు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోకాలంగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వాల నుండి ఇంతవరకు ఎలాంటి లబ్ధి పొందని జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన జర్నలిస్టు భవనాలు మండల నియోజకవర్గంలో ప్రెస్ క్లబ్ లు నిర్మించాలని కోరారు అదేవిధంగా పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు హెల్త్ కార్డులు పోలీస్ భరోసా కార్డులు ఇవ్వాలని తెలిపారు ముఖ్యంగా ప్రతి



జర్నలిస్టుకు ప్రత్యేక ఇంటి స్థలం లేదా ప్రత్యేక డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ఉద్యమం లో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందన్న సంగతి ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ధ్రుపాటి శ్యాంబాబు రాష్ట్ర ప్రచార సహాయ కార్యదర్శి దుర్గం బాలు నల్లగొండ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శామ్ సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి గుండ్ల రాము మోతె మండల అధ్యక్షుడు మాలోతు కోటినాయక్ సూర్యాపేట మండల కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో ఇంటింటా ఎన్నికల ప్రచారం

కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తెరాస నాయకులు మునుగోడు ఉప ఎన్నికలలో భాగంగా ఎన్నికల ప్రచారంలో మునుగోడు మండలం కన్నగూడెం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు అనంతరం ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారం వెంకట్రామిరెడ్డి వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి డిసిసిబి డైరెక్టర్ సాయి రెడ్డి చిన్న కొడప్గల్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ పోటీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



**ఎల్బీనగర్** పభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్,హైదరాబాద్ లోని పర్యావరణ పరిరక్షణ – శిక్షణా పరిశోధన సంస్థ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ కళాశాల విద్యాశాఖ సంయుక్తంగా గత సెప్టెంబర్ 16న ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలలో హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అనురాగ్ పాండే ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతికి పెంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జ్యోత్స్నప్రభ తెలియజేశారు. పాండేకు త్వరలో సదరు సంస్థ నుండి బహుమతి ప్రదానం చేయబడతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థిని పోటీలకు సిద్ధం చేసిన కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు డా. డి. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. కె. జ్యోత్స్నప్రభ, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్. ఇ.శంకర్, ప్రత్యేకంగా అభినందించారు.

## డోర్నకల్ తహసిల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధనం చేసిన వీఆర్ఏలు



వీఆర్ఏల జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విఆర్ఎల్ చేపట్టిన నిరవధిక దీక్ష 78 రోజులవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం డోర్నకల్ తహసిల్దార్ కార్యాలయం దిగ్బంధనం చేసి గేటు ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వీఆర్ఏలను పోలీస్ స్టేషన్ కు తరలించి ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకపరచుకూడదని చెప్పి వదిలేయడం జరిగింది . ఈ సందర్భంగా చైర్మన్ ఆలేటి బాలకృష్ణ మాట్లాడుతూ తమకు ఇవ్వాల్సిన పే స్కేల్ జీవో, అర్హత కలిగిన వారికి ప్రమోషన్స్ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని,పోలీసులు అడ్డువచ్చిన అసెంబ్లీ వరకు వెళ్లడానికైనా సిద్ధమేనని, వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో డానియల్, సాయిరాం ,సురేష్ ,లలిత, గురువయ్య, నాగరాజు, సామిల్, దివ్యభారతి, సృజన,నరేష్, ఖలీల్ పాషా, సీతయ్య, నాగుల్ మీరా, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## వంశీకి నివాళులర్పించిన టిఆర్ఎస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్



మండలంలోని నరసింహారావుపేట గ్రామానికి చెందిన గోపిశెట్టి వంశీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ తల్లాడ మండల నాయకులు తుమ్మలపల్లి రమేష్ సోమవారం నరసింహారావుపేటలో వంశీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వంశీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో గోగినేని తిరుమలరావు, కోసూరు రామారావు, సూద నాగేశ్వరరావు, పులి నరసింహారావు, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## చీకటి కాంతయ్యకు నివాళు లర్పించిన నాయకులు.



మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన చీకటి కాంతయ్య ఇటీవల మృతిచెందారు. సోమవారం ఆయన దశదినకర్మ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, తెదేపా నాయకులు యల్లంకి వెంకటేశ్వర్లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో నాయకులు మారెళ్ళ మల్లికార్జునరావు, గోగినేని తిరుమలరావు, దుగ్గినేని వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com